సాక్షి
నల్లగొండ
శుక్రవారం ౹ 16 ౹ మే ౹ 2025



ప్రాణం తీసిన చేపల వేట

చేపల వేట యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన కనగల్ మండలం పగిడిమర్రిలో చోటుచేసుకుంది. - 8లో



అడ్డొస్తున్నాడని..

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని వెల్మకన్నె గ్రామానికి చెందిన మహిళ తన భర్తను హతమార్చింది. - 8లో

గరిష్టం/కనిష్టం
38°/25°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

రామగిరి(నల్లగొండ): కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు టీజీ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఈనెల 26 వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. పుష్కరాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తించదని తెలిపారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నల్లగొండ : కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 400 మార్కులకుపైగా సాధించిన జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సంక్షేమ గురుకులాలు, కేజీబీవీలు, జెడ్పీహెచ్‌ఎస్‌లు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

నల్లగొండ: ఎన్నికల విధుల్లో భాగంగా గతంలో బదిలీ అయిన తహసీల్దార్లను ప్రభుత్వం తిరిగి సొంత జిల్లాలకు పంపింది. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేటివ్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం మల్టీజోన్–2 పరిధిలోని జిల్లాలకు చెందిన తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. వారిలో ఇప్పుడు 44 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 11 మంది తహసీల్దార్లు వారి జిల్లాలకు పంపగా, మరో ఏడుగురు బదిలీపై జిల్లాకు వచ్చారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధచూపాలి



కట్టంగూర్ మండలం కురుమర్తిలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

కట్టంగూర్, శాలిగౌరారం : గ్రామ పంచాయతీ సిబ్బంది మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధచూపాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం కట్టంగూర్ మండలం కురుమర్తి, నారెగూడెం, ఎరసానిగూడెం గ్రామాల్లో నర్సరీలతోపాటు శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో నర్సరీ, రైతులు సాగుచేస్తున్న మునగ తోటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి కూలీలకు రోజువారీగా రూ.307 తగ్గకుండా కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఏపీఓ, ఉపాధి సిబ్బందికి సూచించారు. నారెగూడెం, ఎరసానిగూడెం గ్రామాల్లో గల నర్సరీల్లో మొక్కల పెంపకం సక్రమంగా లేకపోవటంతో జీపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీలను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఎంపీఓను ఆదేశించారు. నిమ్మ, కొబ్బరి, మామిడి, మునగ, డ్రాగన్ ఫ్రూట్ తోటల సాగులో ప్రభుత్వ రాయితీని పొందడంతోపాటు అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. ఆయన వెంట నకిరేకల్ క్లస్టర్ ఏపీడీ బీఎల్ నర్సింహారావు, ఎంపీఓలు చలపతి, సుధాకర్, ఏపీఓలు కడెం రాంమోహన్, జంగమ్మ, ఏపీఎం సైదులు, కార్యదర్శులు జయసుధ, పెద్దయ్య, ఈసీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

స్వర్ణగిరీశుడికి తిరుపావడ సేవ

భువనగిరి : పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తిరుపావడ సేవ వైభవంగా నిర్వహించారు. 450 కిలోల అన్నప్రసాదం, లడ్డూ, వడ తదితర పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం నిర్వహించారు.



భూదాన్‌పోచంపల్లిలోని టూరిజం పార్కులో సుందరీమణులు





యాదగిరి క్షేత్రంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సుందరీమణి



ఇక్కత్‌కు, శిల్పకళకు ఫిదా..

సందడి చేసిన ప్రపంచ సుందరీమణులు

- జిల్లాలో రెండు బృందాలుగా పర్యటన
- ఒక టీం భూదాన్‌పోచంపల్లి, మరొకటి యాదగిరిగుట్ట ఆలయ సందర్శన
- ఇక్కత్ డిజైన్లు చూసి అబ్బురపడిన అందగత్తెలు
- యాదగిరిగుట్టలో నృసింహుడి దర్శనం, శిల్పకళను వీక్షించి పరవశం





భూదాన్‌పోచంపల్లిలోని టూరిజం పార్కులో చేనేత ఇక్కత్ చీరలను పరిశీలిస్తున్న సుందరీమణులు

భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట: మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన సుందరీమణులు గురువారం సాయంత్రం యాదాద్రి జిల్లాలో పర్యటించారు. ఒక బృందం భూదాన్‌పోచంపల్లిని, మరో బృందం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించింది.

నేతన్నల గొప్పదనం చూసి అబ్బురపడి..

ఆఫ్రికా దేశాలకు చెందిన 25 మంది సుందరీమణులు భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. స్థానిక రూరల్ టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన చేనేత థీమ్‌లో పాల్గొని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఇక్కత్ వస్త్రాలను పరిశీలించి అబ్బురపడ్డారు. చేనేతల గొప్పతనం చూసి అందాలభామలు చప్పట్లు కొట్టారు. అలాగే ఇండో వెస్ట్రన్ ఇక్కత్ దుస్తులతో మోడల్స్ నిర్వహించిన ర్యాంప్ వాక్ చూపి మైమరిచిపోయారు. ప్రముఖ డిజైనర్ స్వాతి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలతో రూపొందించిన ఇండో వెస్ట్రన్ ఫ్యాషన్ వస్త్రాలను ప్రముఖ మోడల్స్ ధరించి, ప్రముఖ కొరియోగ్రఫీ సుందర్ పర్యవేక్షణలో ప్రదర్శించిన రాంప్‌వాక్ వావ్ అన్పించింది. సుమారు 30 మంది మోడల్స్ ర్యాంప్‌వాక్ చేశారు.

ఆకట్టుకున్న చేనేత స్టాళ్లు

టూరిజం పార్కు ఆవరణలో పద్మశ్రీ గజం గోవర్ధన్, జాతీయ అవార్డు గ్రహీత తడక రమేశ్, సాయిని భరత్, రాష్ట్ర అవార్డు గ్రహీతలు భోగ బాలయ్య, ఎన్నం మాధవిశివకుమార్, చేనేత టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత సహకార సంఘంతో పాటు గద్వాల్, నారాయణపేట, సిద్ధిపేట గొల్లభామ చేనేత స్టాల్స్ ఏర్పాటు చేశారు.వీటిలో పోచంపల్లి ఇక్కత్‌తో పాటు తేలియారుమాళ్లు, గొల్లభామలు చీరలను చూసి ప్రపంచ సుందరీమణులు మురిసిపోయారు.

సంప్రదాయ చీరకట్టుతో నృసింహుడి క్షేత్రానికి..

కరేబియన్ దీవులకు చెందిన తొమ్మిది మంది సుందరీమణులు యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో శిల్ప కళను చూసి పరవశం పొందారు. సంప్రదాయ చీరకట్టు, లంగా ఓణీతో సాయంత్రం 5గంటలకు కొండపైన గల అతిథిగృహానికి చేరుకున్న సుందరీమణులు.. తొలుత అఖండ దీపారాధన చేశారు. ఆ తరువాత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఫొటోకు పూజలు చేసి మీడియా గ్యాలరీ వద్ద అతిథులకు అభివాదం చేశారు. అలాగే బ్రహ్మోత్సవ మండపం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లో శ్రీస్వామివారి కైంకర్యాలను వీక్షించి ఫొటోలు దిగారు.

ఇక్కత్ వస్త్రాలతో సన్మానం

సుందరీమణులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఇక్కత్ శాలువాతో సన్మానించారు. అదే విధంగా కలెక్టర్ హనుమంతరావు ఇక్కత్ బ్యాగు, చేనేత వస్త్రాలను బహూకరించారు.

క్షేత్రపాలకుడికి పూజలు

క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని సుందరీమణులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ప్రధానాలయంలోని ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కారు. అక్కడి నుంచి గర్భాలయంలోకి వెళ్లి స్వయంభూలకు పూజలు నిర్వహించారు. ఆలయ పారాయణీకుడు నల్లంథీఘల్ సీతారామచార్యులు స్వామివారి విశిష్టతను వారికి వివరించారు. అనంతరం చెంతనే ఉన్న ఆండాల్ అమ్మవారిని సుందరీమణులు దర్శించుకున్నారు. సుందరీమణులకు ఆలయ ముఖ మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ శ్రీస్వామివారి ప్రతిమతో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం వారు ఉత్తర ప్రథమ ప్రాకార మండపానికి చేరుకున్నారు. అక్కడ కృష్ణశిలతో చెక్కిన యాలీ పిల్లర్లు, సింహం తదితర విగ్రహాలను పరిశీలించి తన్మయత్వం పొందారు. అంతకుముందు సుందరీమణులకు కూచిపూడి, భరతనాట్యం, కోలాటం కళాకారులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. కోలాట బృందంతో కలిసి సుందరీమణులు కోలాటం ఆడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టెంపుల్.. సో బ్యూటిఫుల్

ఆలయంలో కలియదిరిగి పరిశీలించిన సుందరీమణులు.. టెంపుల్ సో బ్యూటీఫుల్ అని కితాబునిచ్చారు. అద్భుత కళాఖండం అంటూ కొనియాడారు. ఆలయ నిర్మాణ శైలిని వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు వారికి వివరించారు. సుందరీమణుల పర్యటన సాయంత్రం 5గంటల నుంచి 7 గంటల వరకు రెండు గంటల పాటు కొనసాగింది.



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారికి మొక్కుతున్న అందగత్తెలు

‘ప్రత్యేక’ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాలపై గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక విద్యార్థులకు కావాల్సిన అవసరాలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ఎలాంటి పనులు చేపట్టాలి, వారికి ఏమి అవసరం ఉన్నాయో వెంటనే గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు నారాయణ అమిత్, రాజ్‌కుమార్, నల్లగొండ, చండూరు ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

హాలియా : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని టెస్టుల ద్వారా గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు వినియోగించుకోవచ్చన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే అనుమానితులతోపాటు గంజాయి ఇతర మాదకద్రవ్యాలు విక్రయించేవారి సమాచారాన్ని విలేజ్ పోలీస్ అధికారి అందించడం వల్ల నేరాలను నిరోధించవచ్చన్నారు. గ్రామంలో ప్రమాదాల నివారణకు విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్దన్ గౌడ్, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, వీపీఓ సరిత తదితరులు ఉన్నారు.

61.35 శాతం మందికే!

కార్డుదారులందరికీ అందని రేషన్ బియ్యం

- బియ్యం సరఫరాకు సరిపడా కేటాయించని లారీలు
- పదిహేను రోజులు గడిచినా తప్పని ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో రేషన్ కార్డుదారులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సన్న బియ్యం పంపిణీ సవాలక్ష సమస్యలతో సాగుతోంది. కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ గడువు ఈనెల 15వ తేదీతో ముగిసినా పూర్తి స్థాయిలో గోదాముల నుంచి రేషన్ షాపులకు చేరలేదు. చేరిన బియ్యం కూడా ప్రజలకు ఇంకా పూర్తి స్థాయిలో అందనేలేదు. బుధవారం వరకు 61.35 శాతం కార్డుదారులకే రేషన్ బియ్యం అందినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకంలో మొదటి నెల నుంచే ఇబ్బందులే ఎదురవుతున్నాయి.

మండలాల సంఖ్య	33
రేషన్ షాపులు	950
కార్డుదారులు	4,74,681
లబ్ధిదారులు	13 లక్షలు
బుధవారం వరకు బియ్యం తీసుకున్నవారు	2,91,233
రేషన్ అందని కార్డులు	1,83,448

రేషన్ పంపిణీ సమయం ముగిసినా..

ప్రతినెలా 30 తేదీ వరకే ఎఫ్‌సీఐ గోదాముల నుంచి బియ్యం రేషన్ షాపులకు చేరాలి. ఆ తరువాత ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపు డీలర్లు బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలి. అయితే ఈ నెలకు సంబంధించి ఏప్రిల్ 30 నాటికే బియ్యం రేషన్ షాపులకు చేరాల్సి ఉండగా, మే 15వ తేదీ వచ్చినా కూడా ఇంకా రేషన్ షాపులకు పూర్తి స్థాయిలో బియ్యం చేరకపోవడంతో కార్డుదారులకు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు.

ముందుచూపులేని అధికారులు

జిల్లాలో ప్రస్తుతం యాసంగి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఆ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. అయితే రేషన్ బియ్యం సరఫరాకు, ధాన్యం సరఫరాకు సంబంధించి కాంట్రాక్టు పనులను అధికారులు ఒకరికే అప్పగించడం ఈ సమస్యకు కారణం అవుతోంది. ప్రతినెలా జిల్లాలో ప్రజలకు పంపిణీ చేసే దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి రేషన్ షాపులకు పంపిణీ చేయాలి. ఈ పనులకు జిల్లాలో ఒక కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనులను అధికారులు అదే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. బియ్యం పంపిణీలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. దీంతో 30వ తేదీ నాటికే షాపులకు చేరాల్సిన బియ్యం 15 రోజులు గడిచినా పూర్తిసాయిలో చేరలేదు.

సమన్వయ లోపం.. లారీల సమస్య

ఈ యాసంగి సీజన్‌లో 11,26,021 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 5,68,152 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లు కొంటారని, మరో 5,57,869 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంటుందని సూచించింది. అయినా ఇటు పౌరసరఫరాల సంస్థ, అటు పౌరసరఫరాల శాఖ ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఇప్పుడేమో బియ్యం పంపిణీకి ఉపయోగించే లారీలను కూడా ధాన్యం ట్రాన్స్ పోర్టుకు వినియోగిస్తున్నామని చెప్పి ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారు.

ధాన్యం విషయంలోనూ అదే దుస్థితి

కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో రాక ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్కో కేంద్రానికి మూడు నాలుగు రోజులకు కూడా ఒక లారీ రాని పరిస్థితి ఇటీవల సాక్షి నిర్వహించిన గ్రౌండ్ రిపోర్ట్‌లో వెల్లడైంది. ఒక్కో కేంద్రానికి రెండు చొప్పున లారీలు పెట్టాల్సి ఉన్నా, అవసరం మేరకు పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. పైగా మిల్లర్లు ధాన్యం త్వరగా దింపుకోవడం లేదనే సాకును చెబుతున్నారు. అదే నిజమైతే మిల్లర్లు త్వరగా ధాన్యాన్ని దింపుకునేలా చర్యలు చేపట్టడంలోనూ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

ఎప్పుడూ రాని సమస్య ఇప్పుడే ఎందుకు?

పదేళ్ల నుంచి జిల్లాలో ధాన్యం అత్యధికంగా పండుతోంది. ఈ నాలుగైదేళ్లలో గణనీయంగా దిగుబడి పెరిగింది. ఇన్నేళ్ల కాలంలో ఏటా ఎంత ధాన్యం కొనుగోలు చేసినా, బియ్యం పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. జిల్లా యంత్రాంగానికి ధాన్యం ఎంత మార్కెట్‌కు వస్తుందన్న విషయం ముందుగానే తెలిసినా, ఇటు ధాన్యం లారీల కాంట్రాక్టు వ్యవహారంలో ఇష్టానుసారంగా వ్యవహరించడమే సమస్యకు కారణంగా తెలుస్తోంది. బియ్యం సరఫరాకు సరిపడా లారీలు ఉన్నాయా? లేదా? అనేది చూడకుండానే ధాన్యం సరఫరా కాంట్రాక్టు అప్పగించడం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ: రాష్ట్రంలో గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో హాలియాలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం (టీఆర్‌జీఎస్) రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాన్ని గురువారం మిర్యాలగూడలోని తన నివాసంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్‌తో కలిసి శంకర్‌నాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్, భాగ్యనాయక్, జిల్లా అధ్యక్షుడు అఖిల్ నాయక్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.



టీఆర్‌జీఎస్ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరచిన అర్చకులు శ్రీస్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన తదితర పూజలు చేశారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

సందడి చేసిన సుందరీమణులు


సుందరీమణులకు జాతీయ జెండా బహూకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, సీపీ సుధీర్‌బాబు


సుందరీమణులకు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న పోచంపల్లి వాసులు


పోచంపల్లి టూరిజం పార్కులో ర్యాంప్ వాక్ చేస్తున్న టీవీ నటి దివి


యాదగిరిగుట్టలో సుందరీమణులకు స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు



స్వామివారి ప్రతిమను సుందరీమణికి అందజేస్తున్న యాదగిరిగుట్ట ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకుడు


యాదగిరిగుట్ట ఆలయంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

పోచంపల్లి జరూర్ ఆనా..

- కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి: తెలంగాణతో పాటు పోచంపల్లికి జరూర్ ఆనా అని కలెక్టర్ హనుమంతరావు సుందరీమణులను కోరారు. హంపి థియేటర్ జరిగిన ర్యాంప్‌వాక్ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్ ప్రత్యేకమైన కళ అని, ఇది ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. 2021లో యునెస్కో చేనేత ఉత్తమ హెరిటేజ్ విలేజ్‌గా పోచంపల్లి అంతర్జాతీయ అవార్డు పొందిందని గుర్తు చేశారు. భూదానోద్యమానికి శ్రీకారం చుట్టి లక్షలాది మంది పేదలకు భూదానం చేసిన గొప్ప గ్రామమని కొనియాడారు. భూదాన్‌పోచంపల్లికి సుందరీమణుల సందర్శనతో చేనేతకు మరింత గుర్తింపు రావడమే కాకుండా చేనేత కళాకారులకు కూడ మార్కెటింగ్ సదుపాయాలు పెరుగుతాయని అన్నారు. చేనేత కళను సజీవంగా నిలుపుతున్న చేనేత కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు.


సుందరీమణులను సన్మానిస్తున్న కలెక్టర్

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే..

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో అందంగా, సాంస్కృతిక వారసత్వానికి చిహ్నాలుగా నిలుస్తాయని అన్నారు. మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లు పోచంపల్లికి రావడం ద్వారా చేనేతకు మరింత వైభవం వస్తుందని అన్నారు. ప్రతిఒక్కరూ చేనేతను ఆదరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్, మిస్ వరల్డ్ పోచంపల్లి ప్రోగ్రాం ఇన్‌చార్జి లక్ష్మి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, తెలంగాణ టూరిజం జనరల్ మేనేజర్ మందడి ఉపేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, చింతకింది మల్లేశం, భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సుందరీమణులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చిలుకూరు: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చిలుకూరు మండలం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో జరిగింది. చిలుకూరు మండలం పాలెఅన్నారం గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు బైక్‌పై హుజూర్‌నగర్ నుంచి వస్తూ తమ గ్రామానికి వెళ్లేందుకు మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా.. చిక్సిత నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. మృతదేహం నీటిలో తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా.. నాలుగు రోజుల క్రితమే నీటిలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

యువకుడి ప్రాణం తీసిన చేపల వేట

- కుంటలో మునిగి మృతి
- కనగల్ మండలం పగిడిమర్రిలో ఘటన

కనగల్ : చేపల వేట యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన కనగల్ మండలం పగిడిమర్రి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పగిడిమర్రి గ్రామానికి చెందిన అబ్బిడి నాగర్జున్‌రెడ్డి(36) వ్యవసాయంతో పాటు మెటార్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం పగిడిమర్రి గ్రామానికే చెందిన కొప్పుల ప్రవీణ్ బోరు మోటారు కాలిపోగా.. దానిని బయటకు తీసిన అనంతరం సమీపంలోనే ఉన్న నోముల వారి కుంటలోకి నాగార్జున్‌రెడ్డి చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు కుంటలోకి దిగిన కొన్ని క్షణాల్లోనే నాగర్జున్‌రెడ్డి అందులో మునిగిపోయాడు. అక్కడే ఉన్న ప్రవీణ్ గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా కుంటలో నాగార్జున్‌రెడ్డి ఆచూకీ లభించకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది 4గంటల పాటు శ్రమించి నాగార్జున్‌రెడ్డి మృతదేహన్ని కుంటలో నుంచి బయటకు తీశారు.

కరెంట్ షాక్‌తో మృతిచెందాడా..?

నాగర్జున్‌రెడ్డితో పాటు మరో ఐదుగురు యువకులు కూడా చేపల వేటకు వెళ్లినట్లు తెలుస్తోంది. వీరు కరెంట్ సహాయంతో చేపలు పట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే నాగర్జున్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుడికి ఈత వచ్చని, చిన్న కుంటలో మునిగిపోయే అవకాశమే లేదని గ్రామస్తులు, బంధువులు పేర్కొంటున్నారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు కరెంట్ సహాయంతో చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత పడ్డారు. ఈ క్రమంలోనే వారం క్రితం గ్రామ పరిధిలోని కుంటల్లో కరెంట్ సహాయంతో చేపలు పడితే రూ.10వేల జరిమానా విధిస్తామని డప్పు చాటింపు కూడా వేయించినట్లు మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి తెలిపారు.


అబ్బిడి నాగార్జున్‌రెడ్డి (ఫైల్)

గ్రామంలో విషాదఛాయలు..

నాగర్జున్‌రెడ్డి మృతితో పగిడిమర్రి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో నాగార్జున్‌రెడ్డి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి 3వ తరగతి చదివే కుమార్తె, 1వ తరగతి చదివే కుమారుడు ఉన్నాడు. నాగార్జున్‌రెడ్డి భార్య కోమలి ఏడుస్తున్న తీరు చూసి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. తహసీల్దార్ పద్మ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందించలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


చిలుకూరు: బోల్తాపడిన ఆటో

వలిగొండ: ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం అక్కంపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచెనపల్లికి చెందిన లాడే సుధాకర్ (40), లాడే అంజాజీ ఇద్దరు కలిసి వాహన బ్యాటరీల వ్యాపారం నిమిత్తం గురువారం ఆటోలో చౌటుప్పల్‌కు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వలిగొండ మండలం అక్కంపల్లి వద్ద ఆటో బోల్తా పడడంతో ఆటో నడుపుతున్న సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. అంజాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, అంజాజీకి వైద్యం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

తెలంగాణ జరూర్ ఆనా..

- నినదించిన ప్రపంచ అందగత్తెలు
- సుందరాంగుల మనసుదోచుకున్న భూదాన్‌పోచంపల్లి
- ఆకట్టుకున్న ఇక్కత్ చీరల ప్రక్రియ, డిజైన్‌లు
- అపూర్వ స్వాగతానికి అబ్బురపడిన అందగత్తెలు

సాక్షి, యాదాద్రి : ప్రపంచ సిల్క్ సిటీగా, సాంస్కృతిక వారసత్వం, ఇక్కత్ చీరల నేతకు ప్రసిద్ధిగాంచిన భూదాన్‌పోచంపల్లి, ఆధ్యాత్మిక దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట దేవస్థానం అంతర్జాతీయ సుందరీమణుల మన్ననలు పొందాయి. ప్రధానంగా పోచంపల్లి చీరల తయారీ,డిజైన్,అద్దకం ఇక్కత్ వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు.అంతేకాక రుంజా వాయిద్యం,సంస్కృతి,సాంప్రదాయ నాదస్వర ,కోలాటాల స్వాగతంతో మైమరచిపోయారు. టూరిజం పార్క్ లోకి ఆహ్వానిస్తూ పోచంపల్లికి హృదయపూర్వక స్వాగతం అంటూ అందగత్తెలకు ఆత్మీయ స్వాగతం పలికారు. పోచంపల్లి చేనేత టూరిజం పార్క్ ప్రవేశ దారం వద్ద ఫోటోలకు ఫోజులిస్తూ 'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ నినదించారు. ఇక్కత్ చీరలు, వస్త్రాల తయారీని చూసి వీరు అబ్బురపడ్డారు.ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని స్థానిక పార్కులోపరిశీలించిన అతిథులు, రాట్నంతో దారం చుట్టడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్య చకితులయ్యారు.

స్టెప్పులేసిన సుందరీమణులు

రుంజా కిన్నెర,వాయిద్యాల మధుర సంగీతం అందగత్తెలను మంత్రముగ్ధుల్ని చేసింది. కొందరు కంటెస్టెంట్ లు స్వయంగా రుంజా వాయించగా, మరికొందరు సంగీథానికి లయబద్ధంగా నాట్యం చేశారు. అరి చేతులపై నెమలి సోయగం, నాజూకైన నక్షత్రాలు, పువ్వుల డిజైన్లతో మురిసిపోయిన బ్యూటీలు ఫొటో సెషన్లకు పోజ్ ఇచ్చారు.

ర్యాంపుషో ప్రత్యేక ఆకర్షణ: అందగత్తెలకే అసూయ పుట్టేలా నిర్వహించిన ఫ్యాషన్ షో పోచంపల్లి సందర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రపంచ అందగత్తెలే అచ్చెరువు పొందేలా అసూయ పుట్టేలా భారతీయ నారిమణుల ఇక్కత్ చీరల ఫ్యాషన్ షో అద్భుతం గా సాగింది. ప్రపంచ అందగత్తెలు కళ్లార్పకుండా చూస్తూ చప్పట్లు, కేరింతలతో షోను ప్రోత్సహించారు. ఫ్యాషన్ షో లో పాల్గొన్న యువతులను మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు కలసి అభినందించారు. స్థానికులు ఈ షో ను ఆసక్తిగా తిలకించారు. జిల్లాలో అందగత్తెల పర్యటనలను యంత్రాంగం పక్కా ప్లాన్‌ప్రకారం సక్సెస్ చేసింది.


శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము
దేవాదాయ - ధర్మాదాయ శాఖ
గ్రా॥ దర్వేశిపురం (పర్వతగిరి), మం॥ కనగల్, జిల్లా॥ నల్లగొండ

టెండర్ కం - బహిరంగ వేలము ప్రకటన తేది.10.05.2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! పై దేవస్థానము వద్ద తేది. 23.05.2025 శుక్రవారం రోజున మ॥గం॥ 1-00ల నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2025-2026 సం॥నకు దేవాలయ ప్రాంగణంలో వేలము నిర్వహించబడును. ఆసక్తిగలవారు పాటలో పాల్గొనవలసిందిగా కోరనైనది.

క్ర. సం.	వేలము వివరములు	కాల పరిమితి 1 సం॥	డిపాజిట్ దబ్బు	టెండర్ షెడ్యూలు ధర	రిమార్క్స్
1	తలనీలాలు సేకరణ హక్కు	తేది.01.06.2025 నుండి తేది.31.06.2026 వరకు	3,00,000-00	1000-00	[illegible]

నోట్ : డిపాజిట్ / నగదు డి.డి.లు స్వీకరించబడును. డి.డి.లు కార్యనిర్వహణాధికారి శ్రీ యల్లమ్మ దేవస్థానము, గ్రా॥ దర్వేశిపురం పేరుమీద తీయవలెను.

చీదేటి వెంకట్‌రెడ్డి
చైర్మన్ & ధర్మకర్తల మండలి. సెల్: 9441562155

శ్రీ జల్లేపల్లి జయరామయ్య
కార్యనిర్వహణాధికారి. సెల్: 9951999438

వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 90000 10884, 9949609848

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజినల్ బిజినెస్ ఆఫీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
మొదటి అంతస్తు, ఆర్.పి. రోడ్ బ్రాంచ్, నల్లగొండ. - 508 001.

కనగల్ బ్రాంచ్ లీజుపై ఆవరణ కావలెను

SBI వారు తమ కనగల్ బ్రాంచ్ కోసం సుమారు 186 చ॥మీ॥లు నుండి 223 చ॥మీ॥లు వరకు (2000 Sft. to 2400 Sft.) కార్పెట్ ఏరియా కలిగి ఉండి. వాణిజ్య / కార్యాలయ ఉపయోగం కోసం లీజు అద్దె ప్రాతిపదికన ఆవరణ కోసం యజమానులు / పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ల నుండి ఆఫర్లు కోరుతున్నారు.

ఆవరణ తగిన పవర్ లోడ్, నీటి సరఫరా, పార్కింగ్ స్పేస్, జనరేటర్ ఉండేందుకు స్పేస్, ఇ-లాబీ మరియు V-SAT మంచి ఫ్రంటేజీతో సహా అన్ని సదుపాయాలను కలిగి ఉండాలి. మొత్తం స్పేస్ ఒకే ఫ్లోర్‌లో ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండవలెను. ఆవరణ స్వాధీనం చేసుకునేందుకు / చేసేందుకు సిద్ధంగా ఉండాలి. వివరమైన పారామీటర్స్ కలిగిన సాంకేతిక బిడ్ దాఖలు కోసం నమూనా, నియమ నిబంధనలు మరియు ధర బిడ్‌ను 16-05-2025 నుండి 29-05-2025 వరకు బ్యాంక్ వెబ్‌సైట్ https://www.sbi.co.in లో ప్రొక్యూర్‌మెంట్ న్యూస్ క్రింద నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ప్రభుత్వ శాఖలు / ప్రభుత్వ యూనిట్లు / బ్యాంక్‌లకు సొంతమైన ఆవరణలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

అన్ని విధాలుగా పూర్తి చేసిన సీల్డ్ కవర్‌లో ఆఫర్‌ను 29-05-2025న మ. 3.00 గం॥లకు లేదా ఆలోగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ బిజినెస్ ఆఫీస్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మొదటి అంతస్తు, ఆర్.పి. రోడ్ బ్రాంచ్ నల్లగొండ - 508001 కు దాఖలు చేయవలెను. ఎటువంటి కారణాలు తెలియజేయకుండా ఏదేని లేదా అన్ని ఆఫర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు SBI కి హక్కు కలదు. బ్రోకర్స్ అనుమతించబడరు.

సం/- రీజినల్ మేనేజర్, ఆర్.బి.వో. నల్లగొండ

సాక్షి క్లాసిఫైడ్స్


Real Estate

HOUSE FOR SALE

- 2, 3 & 4BHK లగ్జరీ విల్లాలు నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి డి-మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్స్, స్విమ్మింగ్ పూల్, సంప్ర : Ph: 7013578378 [HA-149]


Wanted

- MNC కంపెనీలో 15 మంది M/F కావలెను. జీతం: 15000/- నుండి 25000/- వరకు. B.Tech, MBA, MCA, 10+2. Age: 18-40. Ph: 9121868938 [HA-227028]

ప్రకటన గోరంతే! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లలో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితం గా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకు లను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సౌదీఅరేబియాలో కోదాడ వాసి మృతి

కోదాడరూరల్: సౌదీఅరేబియాలో కోదాడ పట్టణానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని కౌసర్‌నగర్‌కు చెందిన షేక్ తాజుద్దీన్(49) ఉపాధి కోసం పదేళ్ల కిందట సౌదీఅరేబియాకు వెళ్లాడు. అక్కడ దమామ్ పట్టణంలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు ఇండియాకు వచ్చి వెళ్తుండేవాడు. నెల రోజుల క్రితం సౌదీఅరేబియాలో తనకు పరిచయం ఉన్న కపిల్ పేరు మీద తాజుద్దీన్ లైసెన్స్ తీసుకొని కూరగాయల వ్యాపారం మొదలుపెట్టాడు. కొన్నిరోజుల తర్వాత షాపు లైసెన్స్ తన పేరు మీద ఉంది కావును షాపును తనకు అప్పగించి వెళ్లిపోవాలని కపిల్ తాజుద్దీన్‌ను బెదిరించసాగాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన తాజుద్దీన్ అనుమానాస్పదస్థితిలో కాలిపోయి చావుబతుకుల మధ్య ఉంటే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తాజుద్దీన్ మృతిచెందినట్లు అతడి స్నేహితులు ఫోన్ చేసి తాజుద్దీన్ కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తాజుద్దీన్ మృతదేహాన్ని ఇండియాకు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.


తాజుద్దీన్ (ఫైల్)

మార్చి 3న అక్కడకు వెళ్లి..

జనవరి 6న తాజుద్దీన్, అతడి భార్య షాజహాన్ కలిసి ఇండియాకు వచ్చారు. మార్చి 3న తిరిగి సౌదీఅరేబియాకు వెళ్లి రూ.10లక్షల అప్పులు తీసుకొచ్చి కూరగాయల షాపు పెట్టినట్లు తాజుద్దీన్ భార్య తెలిపారు. షాపు పెట్టిన తర్వాత కపిల్ షాపు తనకు అప్పగించాలని బెదిరించినట్లు ఆమె పేర్కొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి జైలుశిక్ష

చివ్వెంల(సూర్యాపేట): వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయ మూర్తి పి. లక్ష్మీశారద గురువారం తీర్పు వెలువరించారు. ఆత్మకూర్ (ఎస్) మండలం దాచారం గ్రామానికి చెందిన బొమ్మగాని శ్రీనివాస్‌కు అదే మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామ శివారులో 14 గుంటల భూమి ఉంది. అందులో 2 గుంటల భూమిని 2005లో తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికే చెందిన సల్లగుండ్ల బజార్‌కు విక్రయించాడు. దాని పక్కనే మరో 3 గుంటల భూమిని 2020లో బోట్యా తండాకు చెందిన గుగులోతు బుజ్జమ్మకు విక్రయించాడు. 2020 జూన్ 16న బుజ్జమ్మకు విక్రయించిన భూమిని కొలిచేందుకు గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులను తీసుకుని వెళ్లాడు. భూమిని కొలుస్తుండగా.. పక్కనే భూమి ఉన్న సల్లగుండ్ల బజార్, అతడి భార్య యల్లమ్మ, కుమారుడు పవన్, అల్లుడు ఎర్ర సుమన్ అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నారు. తమకు విక్రయించిన భూమికి వాస్తు కోసం ఇంకా కొంత భూమి ఇవ్వాలని బొమ్మగాని శ్రీనివాస్‌తో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సల్లగుండ్ల బజార్ బొమ్మగాని శ్రీనివాస్ గుండెపై బలంగా గుద్దడంతో శ్రీనివాస్ స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అతడిని అక్కడే ఉన్న పెద్దమనుషులు సూర్యాపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ విఠల్‌రెడ్డి సల్లగండ్ల బజార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడు సల్లగుండ్ల బజార్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

గుండెపోటుతో సీపీఎం నేత చిట్యాల బుచ్చిరెడ్డి మృతి

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చిట్యాల బుచ్చిరెడ్డి గుండెపోటుతో గురువారం మృతిచెందారు. రామన్నపేట తాలుకాలో సీపీఎం నిర్మాణం కోసం ఆయన ఎంతో కృషిచేశారు. గీత కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారు. నక్సలైట్ల హిట్ లిస్ట్‌లో ఉన్నా కూడా ధైర్యంతో చౌటుప్పల్ ప్రాంతంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. బుచ్చిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం పంతంగి గ్రామంలో నిర్వహించనున్నట్లు సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి రత్నం శ్రీకాంత్ తెలిపారు. బుచ్చిరెడ్డి మృతదేహానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డితో పాటు సీపీఎం నల్లగొండ జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, ఎండీ సలీం, భువనగిరి జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ పాషా తదితరులు నివాళులర్పించారు.



వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

నకిరేకల్ : వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం మర్రూర్ గ్రామానికి చెందిన పుట్ట చంద్రమ్మ గురువారం తన ఇంటి బయట కూర్చొని ఉండగా.. ఇద్దరు యవకులు ఆమె వద్దకు వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చసినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సులో సీటు కోసం కొట్లాట


బస్సులో సీటు కోసం కొట్టుకుంటున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో బస్సులో సీటు కోసం కొట్టుకున్నారు. గురువారం ఉదయం 11గంటల సమయంలో స్వామిని దర్శించుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో కొండ పైన బస్టాండ్‌లోకి బస్సు రావడంతో సీట్ల కోసం ప్రయాణికులు పోటీ పడ్డారు. ఈ సమయంలో మహిళా భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి లోనైన ఇరు వర్గాల కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకుకున్నారు. దీంతో అక్కడే ఉన్న ఎస్‌పీఎఫ్ పోలీసులు, ఆలయ సిబ్బంది వారిని అడ్డుకొని పంపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కనగల్ : పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం రాంచంద్రపురం గ్రామానికి చెందిన వల్కి లింగయ్య(50)కు కొంతకాలంగా మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తించేవాడు. ఈ నెల 4వ తేదీన తన ఇంటి పక్కన ఉన్న మేకల కొట్టంలో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లి కిందపడిపోయాడు. అతడి కుమారులు గమనించి ఏమైందని అడగ్గా.. పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లింగయ్య కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొప్పుల యాదగిరిరెడ్డి, ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి, లచ్చయ్య, మాధవరెడ్డి, బాలరాజు తదితరులు రూ.5000 ఆర్థికసాయం అందజేశారు.

పురుగులమందు తాగి..

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన కట్ట లింగయ్య(60) ఈ నెల 13వ తేదీన తన ఇంటి వెనుక పశువుల కొట్టంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడని భార్య యాదమ్మ మందలించడంతో లింగయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి అల్లుడు కొరివి శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు.. భార్య మృతి

- భర్తకు గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): ఆగి ఉన్న కంటైనర్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో భార్య మృతిచెందగా.. భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం ఐలాపురం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన భృగుమళ్ల హరీష్, అతని భార్య కళ్యాణి (32) కారులో ఖమ్మంకు వెళ్తుండగా మార్గమధ్యలో చివ్వెంల మండలం ఐలాపురం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారి పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కళ్యాణి తలకు, చాతిలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో హరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. హరీష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

గట్టుప్పల్ : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది భార్య. ఈ ఘటన గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో ఈ నెల 10న చోటు చేసుకోగా.. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి గురువారం విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్మకన్నె గ్రామానికి చెందిన వల్లపు మల్లేష్(37) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మల్లేష్ భార్య హేమలతతో అదే గ్రామానికి చెందిన రేవెల్లి నవీన్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం మల్లేష్‌కు తెలియడంతో హేమలతను మందలించాడు. దీంతో తమ వివాహేతర సంబంధానికి మల్లేష్ అడ్డొస్తున్నాడని అతడిని అంతమొందించాలని అతడి భార్య హేమలత, ఆమె ప్రియుడు నవీన్ నిర్ణయించుకున్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

మద్యం తాగించి..

ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం మల్లేష్ నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో టైల్స్ పెట్టడానికి నవీన్ వచ్చాడు. అనంతరం వారిద్దరు కలిసి గ్రామంలో మద్యం తాగి తమ ఇళ్లకు వెళ్లారు. తిరిగి సాయంత్రం నవీన్ మల్లేష్‌ను పిలిచి ఫుల్లుగా మద్యం తాగించాడు. ఈ విషయాన్ని నవీన్ ఫోన్ ద్వారా హేమలతకు చెప్పాడు. రాత్రి 10.30 గంటలకు మల్లేష్‌ను నవీన్ బైక్‌పై ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టి అక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో మల్లేష్ మంచంపై నిద్రకు ఉపక్రమించగానే నవీన్, హేమలత కలిసి టవల్‌తో మల్లేష్ ముఖంపై అదిమిపట్టి శ్వాస ఆడకుండా చేసి హతమార్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున తన భర్త చనిపోయాడని హేమలత కేకలు వేస్తూ అత్త మామలకు, ఇరుగు పొరుగు వారికి చెప్పింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హేమలతను ప్రశ్నించగా.. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానించి విచారణ చేపట్టారు. ఈ విచారణలో హేమలత, ఆమె ప్రియుడు నవీన్ కలిసి పథకం ప్రకారమే మల్లేష్ హతమార్చినట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన చండూరు సీఐ ఆదిరెడ్డి, గట్టుప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ ఆర్. అంజయ్య, పోలీస్ సిబ్బంది వి. రమేశ్, సుదర్శన్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.